అభివృద్ధి నిల్.. సంక్షేమం కిల్

- ప్రజల బాగోగులు పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- చేసిన వాగ్దానాల ఊసే మరిచిన వైనం
- దిక్కు తోచని స్థితిలో ప్రజలు



జగనన్న ఆరోగ్య సురక్షలో రోగులను పరిశీలిస్తున్న సిబ్బంది (ఫైల్)

జగదాంబ: కొత్తరేషన్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులో మార్పులు, చేర్పుల వంటి ప్రభుత్వానికి సంబంధించిన పనులు పూర్తి కావాలని గవర్నమెంట్ ఆఫీసులకు వెళ్లే ప్రజలను ఉద్యోగులు ముప్పుతిప్పలు పెట్టేవారు. సర్వర్లు పని చేయడం లేదనో, లింక్ ఓపెన్ కావడం లేదనో, సార్ సెలవులో ఉన్నారనో చెప్పి పని కాకుండానే పంపేసేవారు. అటువంటి రోజుల నుంచి ఎవరు ఏ పని మీద వెళ్లినా నిమిషాల్లో పూర్తి చేసి సగౌరవంగా పంపించే విధానాన్ని జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రజలకు పరిచయం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాలను ప్రారంభించి ప్రజలు కోరుకునే అన్ని పనులు ఒకేచోట సులువుగా పూర్తయ్యేలా నూతన విధానానికి రూపకల్పన చేశారు.



నాడు కళకళలాడిన సచివాలయాలు నేడు నిర్మానుష్యంగా..



ప్రసాద్‌గార్డెన్స్ సచివాలయంలో ఆధార్ నమోదు చేస్తున్న కార్యదర్శి (ఫైల్)

జగనన్న హయాంలో వెల్లువెత్తిన సంక్షేమం..

సామాజిక పింఛన్ల నుంచి విద్యా దీవెన, వైఎస్సార్ పెన్షన్ కానుక, జగనన్న చేదోడు, ఈబీసీ నేస్తం, జగనన్న తోడు, వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి, వసతి దీవెన, వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ మత్స్యకార భరోసా, వైఎస్సార్ వాహన మిత్ర, నేతన్న నేస్తం, రైతు భరోసా, వైఎస్సార్ లా నేస్తం, వైఎస్సార్ బీమా వంటి సంక్షేమ పథకాలు, జగనన్న సురక్షతో ధ్రువపత్రాలు, రేషన్, ఆధార్ కార్డులు, గ్యాస్ కార్డులు.. ఇలా పేద, మధ్య తరగతి వారు ఉక్కిరిబిక్కిరి అయ్యేలా సంక్షేమ పథకాలు అందిస్తూ జగనన్న ప్రతి ఇంటికి పెద్ద కొడుకుగా నిలబడ్డారు. నేడు అవన్నీ కనుమరుగైపోయాయి. జగనన్న చెప్పినవే కాకుండా చెప్పనివీ ఇచ్చి ఆదుకుంటే కూటమి నాయకులు ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానాలే పదినెలలు కావస్తున్నా అమలు చేయలేకపోతున్నారు.

ఇంటి పన్నులు.. సర్వేలకే పరిమితం..

నేడు కూటమి ప్రభుత్వం చక్కని సచివాలయాల విధానానికి తూట్లు పొడుస్తోంది. ఇప్పుడు సచివాలయాల సేవలంటే కేవలం ఇంటి పన్నులు వసూలు చేయడం, దేనికో తెలియని సర్వేలు చేయడమే పరమావధిగా తయారు చేశారు. దీంతో ప్రజలు మళ్లీ అవే కష్టాలు పడాల్సి వస్తోంది.

ఎక్కడికి వెళ్లాలో తెలియడంలేదు..



ఆధార్ కార్డు కోసం వచ్చాను. ఇప్పుడు సచివాలయాల్లో పెద్దగా ఉద్యోగులు ఎవరూ ఉండడంలేదు. సర్వేల పేరుతో వాళ్లని అధికారులు బయటికి పంపించేస్తున్నారు. దీంతో మేం పదేపదే తిరగాల్సి వస్తోంది. ఎక్కడికెళ్లాలో.. ఎవరితో చెప్పుకోవాలో అర్థం కావడంలేదు.

–అలవన అప్పలకొండ, పండావీధి.

నమ్మినందుకు బుద్ధి చెప్పారు..

కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తోంది. ఏ ఒక్క పథకం అమలు కాలేదు. పేదలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారు. ఎన్నికలకు ముందు చెప్పినవేవీ చేయడంలేదు. నమ్మినందుకు ఈ ప్రభుత్వం బాగా బుద్ధి చెప్పింది.



–రమణమ్మ, ప్రసాద్‌గార్డెన్స్

ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలి



కేజీహెచ్ మార్చురీ వద్ద ధర్నా చేస్తున్న మహిళా సంఘాల నాయకులు

మహారాణిపేట: మధురవాడ స్వయంకృషినగర్‌లో ప్రేమ పేరుతో ఉన్మాదిగా మారి, పెళ్లికి నిరాకరించిన అమ్మాయి దీపికపై దాడికి పాల్పడి, అడ్డు వచ్చిన ఆమె తల్లిని దారుణంగా హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఐద్వా, మహిళా సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కేజీహెచ్ మార్చురీ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా నాయకురాలు పి.మణి మాట్లాడుతూ తక్షణం హోమ్ మంత్రి అనిత బాధిత కుటుంబాన్ని పరామర్శించి, నష్టపరిహారం ప్రకటించాలని కోరారు. మధురవాడలో నేరాల సంఖ్య విపరీతంగా పెరిగిన నేపథ్యంలో అదనంగా మరో రెండు పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గంజాయి, మద్యం విచ్చలవిడిగా దొరకడం వల్ల దారుణాలు పెరిగాయని ఆమె ఆరోపించారు. ఇటీవల మధురవాడలో ఐదేళ్ల పాపపై స్కూల్ మాస్టర్ అత్యాచారం చేసిన ఘటన మరువక ముందే ఇలాంటి దారుణం జరిగిందన్నారు. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఎండీ బేగం, దేవుడమ్మ, పుష్ప, ఐద్వా నాయకులు కొండమ్మ, సుజాత, పద్మ, సీపీఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సీఐటీయూ నాయకులు ఆర్.కె.ఎస్.వి. కుమార్, ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై దృష్టి సారించండి

అల్లిపురం: స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలని జోన్–4 జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు సూచించారు. ఈ మేరకు వెంకటేశ్వరమెట్ట సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గ్రేటర్ విశాఖ మంచి ర్యాంకు సాధించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సచివాలయం సిబ్బంది, ఆర్పీలను కోరారు. ప్రజలను కలిసి వారి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ టి.సీతారామయ్య, ఆర్పీలు పాల్గొన్నారు.

మానసిక ఆస్పత్రికి మతిస్థిమితం లేని మహిళ



మహిళతో మాట్లాడుతున్న మహారాణిపేట పోలీసులు, మమత

అల్లిపురం: కొంత కాలంగా బీచ్‌రోడ్డులోని గోకుల్ పార్క్, సీ పరెల్ ఏరియాల్లో మతిస్థిమితంలేని మహిళ తిరుగుతున్నట్లు పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి గమనించారు. విషయాన్ని మహారాణిపేట పోలీసులకు తెలిపారు. దీంతో వారు మమతా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి మమత సహకారంతో ఆ మహిళను గుర్తించి చినవాల్తేరులో గల మానసిక వైద్యశాలలో చేర్పించారు. ఆమెకు చికిత్స అందజేస్తున్నట్లు మహారాణిపేట పోలీసులు తెలిపారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



ప్రదర్శన ఇస్తున్న కూచిపూడి నృత్య కళాకారులు

డాబాగార్డెన్స్: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మహారాణిపేటలో గల అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం నాట్యదీపిక అకాడమీ విద్యార్థుల కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. అకాడమీ వ్యవస్థాపకురాలు ఎల్. ఇంద్రాణి నరేంద్ర నేతృత్వంలో పిల్లలు తమ నృత్యంతో పలువురి ప్రశంసలు అందుకున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



అవగాహన కల్పిస్తున్న సీఐ ఎర్రంనాయుడు

అల్లిపురం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని టూటౌన్ సీఐ ఎర్రంనాయుడు హెచ్చరించారు. గురువారం సాయంత్రం ఆయన ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆటో డ్రైవర్లు, బిచ్చగాళ్లు, ప్రయాణికులను సమీకరించి అవగాహన కల్పించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో గంజాయి, మద్యం తాగి అల్లర్లు సృష్టించరాదన్నారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని, వారిని గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలని ఆటో డ్రైవర్లకు హితవు పలికారు. యాచకులు గంజాయి వంటి మత్తు పదార్థాలు అమ్మినా, వినియోగించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణం నెలకొనేలా చూడాలన్నారు.

సీతారాముల కల్యాణానికి చురుగ్గా ఏర్పాట్లు



కల్యాణోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఈవో శోభారాణి తదితరులు

డాబాగార్డెన్స్: జగదాంబ జంక్షన్ సమీపాన మహారాణిపేట అంబికాబాగ్ రామాలయంలో శ్రీరామనవమికి సీతారాముల కల్యాణం ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఈ నెల 7 వరకు నిర్వహించనున్న కల్యాణ మహోత్సవాలకు సన్నాహాలు పూర్తయ్యాయి. ఈ మేరకు ఉత్సవాలకు సంబంధించి గురువారం ఆలయ ప్రాంగణంలో ఈవో కె. శోభారాణి వివరాలు వెల్లడించి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 6న సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. 7న శ్రీరామ పట్టాభిషేకం వేడుకగా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కల్యాణం చేయించుకోదలిచే భక్తులు 0891–2528645, 2566514 నంబర్లలో సంప్రదించాలన్నారు. శ్రీరామనవమి కల్యాణ మహోత్సవంలో పాల్గొనదలిచే ఉభయదాతలు రూ.1,116 చెల్లించి, రసీదు పొంది కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.ఎస్. తిరుమలేశ్వరరావు, ప్రధాన అర్చకుడు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్

డాబాగార్డెన్స్: పాతనగరంలో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ కార్మికులు, కర్షకులు, పాఠశాల పిల్లల కోసం గురువారం మజ్జిగ, రాగి జావ చలివేంద్రాన్ని ప్రారంభించింది. సంస్థ గౌరవ అధ్యక్షుడు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా వివేకానంద సంస్థ మజ్జిగ, రాగి జావ చలివేంద్రం నిర్వహిస్తూ వస్తుందని, వేసవిలోనే కాక ప్రతి రోజూ సంస్థ పోషక విలువలతో కూడిన రాగిజావ బాటసారులకు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సీనియర్ సభ్యుడు డి. సత్తిబాబు, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని నిరసన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

సీతమ్మధార: వీఎంఆర్‌డీఏ పరిధిలోని వివిధ పార్కుల్లో గత 30 ఏళ్లుగా పని చేస్తున్న 11 మంది గార్డెన్ కార్మికులను వుడా అధికారులు అన్యాయంగా తొలగించారని ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి వి.కృష్ణారావు అన్నారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద తొలగించిన కార్మికులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని లేదా పని చేసిన కాలానికి గ్రాట్యుటీ, బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. వుడాలో సొసైటీ కార్మికులుగా ఉన్న 11 మందిని 60 ఏళ్లు నిండాయన్న నెపంతో తొలగించడం దుర్మార్గమని, రాష్ట్ర ప్రభుత్వం 62 ఏళ్ల వయో పరిమితి పెంచిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గార్డెన్ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, వారాంతపు, ప్రభుత్వ, పండగ సెలవులు, గ్రాట్యుటీ వంటి ఏ కార్మిక చట్టాలు అమలు చేయడానికి అధికారులు, వుడా చైర్మన్, కార్మిక శాఖ అధికారులు ఎందుకు పూనుకోవడం లేదని ప్రశ్నించారు. వీరిని తొలగించి 6 నెలలు కావస్తున్నా వుడా కమిషనర్, చైర్మన్, డీసీఎల్ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఇప్పటికైనా తొలగించిన కార్మికులకు న్యాయం చేయాలని, లేదంటే కుటుంబాలతో వీఎంఆర్‌డీఏ కార్యాలయం ఎదుట దీక్ష చేపడతామన్నారు. ఈ ధర్నాలో కార్మికులు రాంబాబు, శ్రీను, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

సవరణ బిల్లుపై పెన్షనర్ల నిరసన



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

డాబాగార్డెన్స్: కేంద్ర ప్రభుత్వం గత నెల 25న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన పెన్షన్ నిబంధనల సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ పెన్షనర్ల సంఘాలు గురువారం తీవ్ర నిరసన చేపట్టాయి. డాబాగార్డెన్స్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద జాయింట్ ఫోరం ఆఫ్ బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ ఫోరం ఆఫ్ బీఎస్ఎన్ఎల్ ప్రతినిధులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దొడ్డి దారిన ఆర్థిక బిల్లు రూపంలో పెన్షన్ సవరణ బిల్లు ప్రవేశపెట్టిందన్నారు. ఫలితంగా దేశంలోని 65 లక్షల మంది పెన్షనర్లు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. గతంలో పెన్షన్ అనేది దయా భిక్ష కాదని, అది ప్రభుత్వ ఉద్యోగి హక్కు అని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పలువురు వక్తలు పేర్కొన్నారు. పెన్షనర్ల హక్కులకు భంగం కలిగించే ఈ బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలని, పెన్షనర్ల హక్కులు కాపాడాలని డిమాండ్ చేశారు. 8వ వేతన సంఘం నివేదికలో బీఎస్ఎన్ఎల్ పెన్షన్ సవరణ అంశాన్ని కూడా చేర్చాలని డిమాండ్ చేశారు. నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్, భారత్ పెన్షన్ సమాజ్ వంటి అనేక ట్రేడ్ యూనియన్ సంస్థలు ఇచ్చిన పిలుపు మేరకు ఈ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఎంఆర్ పట్నాయక్, ఎ. చిట్టిబాబు, కె. సోమసుందరం, వరప్రసాద్, అచ్యుతరావు, అధిక సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.

పక్కాగా ఒంటి పూట బడుల అమలు

విశాఖ విద్య: వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న దృష్ట్యా అన్ని పాఠశాలల యాజమాన్యాలు ఒంటి పూట బడులు పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం గురువారం ఒక ప్రకటనలో సూచించారు. తొమ్మిది, పదో తరగతులకు ప్రత్యేక తరగతులు పేరిట రెండు పూటలా నిర్వహిస్తున్నట్లు తమ కమిషన్‌కు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఫిర్యాదులు అందజేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎవరికీ ఎటువంటి మినహాయింపులు ఉండబోవని, ఒంటి పూట బడులు అమలు జరపాల్సిందేనన్నారు. తమ కమిషన్ ఆదేశాలు, ప్రభుత్వ ఉత్తర్వులు పాటించని పాఠశాలల యాజమాన్యాలపై డేగకళ్లతో పర్యవేక్షణ జరపడంతోపాటు ఆయా స్కూళ్ల గుర్తింపు రద్దు, క్రిమినల్ చర్యలకు వివిధ సిఫార్సులు చేస్తామని చెప్పారు.

నాసా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో పాఠశాల ఏజీఎం రాజ్ కుమార్

సీతమ్మధార: ఇటీవల నాసాలో నిర్వహించిన పోటీల్లో నారాయణ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా గురువారం మధ్యాహ్నం నాసా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆశీల్‌మెట్టలోని పాఠశాల ఆవరణలో ఏజీఎం జి. రాజ్‌కుమార్ అభినందించారు. నాసా నిర్వహించిన పోటీల్లో తమ పాఠశాలల విద్యార్థులు రూపొందించిన పది ప్రాజెక్టులు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. కూర్మన్నపాలెం ఒలింపియాడ్ విద్యార్థులు రూపొందించిన ఆర్బిటల్ ఒయాసిస్ లిటరరీ మెరిట్‌కు ప్రథమ బహుమతి, ఈటెక్నో విద్యార్థులు రూపొందించిన సెలెస్టియన్ బిగినింగ్స్ కాస్మిక్ ఎండింగ్ లిటరరీ మెరిట్‌కు ద్వితీయ స్థానం, సెలెస్టియన్ కొరియోగ్రఫీ లిటరరీ మెరిట్‌కు తృతీయ స్థానంతో పాటు మరిన్ని విభాగాల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. కార్యక్రమంలో నారాయణ పాఠశాలల డీన్లు, కో ఆర్డినేటర్లు, ఆర్ఐలు, ప్రిన్సిపాళ్లు రాజేష్, అనిత, ధనలక్ష్మి, మహేష్, కిషోర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలంలో దుకాణాలు పెట్టరాదు



పూర్ణామార్కెట్ వద్ద వ్యాపారుతో మాట్లాడుతున్న సీపీ శంఖబత్ర బాగ్చి

జగదాంబ: పూర్ణామార్కెట్ పార్కింగ్ స్థలంలో వాహనాల పార్కింగ్ మాత్రమే చేయాలని పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చి అన్నారు. గురువారం సాయంత్రం ఆయన పూర్ణామార్కెట్‌ను పరిశీలించి మాట్లాడారు. రహదారిపై వ్యాపారులు జంగిడీలు పెట్టడం వల్ల వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వాహనాల కోసం మార్కింగ్ చేయాలన్నారు. అలాగే ఫుట్‌పాత్‌లను పాదచారులు మాత్రమే ఉపయోగించుకోవాలని, ఎటువంటి ఆక్రమణలు జరిగినా చర్యలు తప్పవన్నారు. మార్కెట్ లోపలి వ్యాపారులు, బయటున్న చిరు వ్యాపారులు స్థలాలు సర్దుబాటు చేసుకోవాలన్నారు. ఇందుకోసం జోనల్ కమిషనర్ ప్రణాళిక సిద్ధం చేయాలని సీపీ తెలిపారు. అనంతరం రామకృష్ణా జంక్షన్ వరకు సీపీ రహదారిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 150 మంది విద్యార్థుల ఎంపిక



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న హెచ్ఆర్ మేనేజర్

డాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో గురువారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. నిర్మాణ్ ఆర్గనైజేషన్, లెర్నింగ్ ట్రీ, సహస్ర ఎడ్యుకేషన్ ఫౌండేషన్, మనం ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన డ్రైవ్‌లో 15 కంపెనీలు పాల్గొన్నాయి. 150 మంది విద్యార్థులు ఎంపికై ఉద్యోగావకాశాలు దక్కించుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు తెలిపారు. సుమారు 400 మంది విద్యార్థులు హాజరైన డ్రైవ్‌లో వివిధ కంపెనీల హెచ్ఆర్ మేనేజర్లు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారిగా డి. సంతోష్‌కుమార్ వ్యవహరించారు.

డ్రగ్స్‌రహిత నగరంగా తీర్చిదిద్దుదాం

- యువత సహకారంతోనే సాధ్యం
- పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



డ్రగ్స్ దుష్పరిణామాల గురించి వివరిస్తున్న సీపీ బాగ్చి

గోపాలపట్నం: సుందర విశాఖను మాదక ద్రవ్యాల రహిత నగరంగా మారుద్దామని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. అందుకు విద్యార్థుల సహకారం అవసరమన్నారు. మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై గోపాలపట్నంలోని ఆదిత్య కళాశాలలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాలు బయట వ్యక్తుల వల్ల అలవాటవుతాయని, అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముందు సరదాగా మొదలైనా, తర్వాత అలవాటుగా మారి జీవితాలను నాశనం చేస్తుందని తెలిపారు. మాదక ద్రవ్యాల వల్ల శరీరంలో నాడీవ్యవస్థ దెబ్బ తింటుందని దృశ్య మాధ్యమం ద్వారా వివరించారు. సైబర్ నేరస్థుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటివి అమ్ముతున్నా, ఎవరి వద్దనైనా ఉన్నా 1972 నంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారమివ్వాలని సూచించారు. అనంతరం సీపీని కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహనరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ ఎ.బి.పృథ్వీతేజ, గోపాలపట్నం సీఐ గొలగాని అప్పారావు, ఎస్ఐ రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు

డాబాగార్డెన్స్: ఏవీఎన్ హైస్కూల్లో గురువారం 2024–25 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు పాల్గొని విద్యార్థులు బాగా చదివి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎంవీ భానుమతి, కళాశాల డీన్ శంకర నారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌తో ఉపాధి అవకాశాలు



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు

మురళీనగర్: పాలిటెక్నిక్ విద్యను అభ్యసించడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అన్నారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలిసెట్–2025 ప్రవేశ పరీక్షకు సంబంధించి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ అయ్యిందని, ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 15 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ జి.గణేష్ ఆదేశాల మేరకు పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులు పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహిస్తున్నామన్నారు. ముందుగా ఇచ్చిన సమాచారం మేరకు టెన్త్ పూర్తి చేసిన వారు, పదో తరగతి పరీక్షలు రాసిన 200 మంది విద్యార్థులు శిక్షణ తరగతులకు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. బాలబాలికలకు ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తామన్నారు. స్టడీ మెటీరియల్‌ను ప్రిన్సిపాల్ ఆవిష్కరించి విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

నిలిచి ఉన్న భారీ వాహనాలతో అవస్థలు



శంకరమఠం రోడ్డులో తిష్ట వేసిన భారీ వాహనం

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు శంకరమఠం రోడ్డు, (భగత్ సింగ్ కాలనీ), ఇందిరా సంజయ్ భీమ్‌నగర్ (ఐఎస్‌బీ నగర్) కాలనీ ప్రాంతాల్లో భారీ వాహనాలు రాత్రీ పగలు తేడా లేకుండా రోడ్డుపైనే తిష్ట వేయడంతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చిన్న రోడ్లలో సైతం భారీ వాహనాలు నిలిపివేయడంతో రాకపోకలు ఎలా అని స్థానికులు మండిపడుతున్నారు. ఇటు ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ సిగ్నల్ నుంచి శాంతిపురం మీదుగా ద్వారకానగర్, డైమండ్ పార్కుకు వచ్చే వాహనాల రాకపోకలు ఈ రోడ్డు మీదుగానే జరుగుతాయి. దీంతో నిత్యం ఈ జంక్షన్ రద్దీగా ఉంటుంది. అలాగే ఈ రోడ్డులో రైస్, ఇనుప సామగ్రి షాపులు, హోటళ్లు, హోల్‌సేల్ దుకాణాలు ఉన్నాయి. ఇవి రోడ్డును నగానికి పైగా ఆక్రమించి ఉంటాయి. ఈ నేపథ్యంలో భారీ వాహనాలను రోడ్డు పక్కన నిలిపి ఉంచడం వల్ల ట్రాఫిక్ జామ్ కావడమే కాకుండా రాకపోకలకు ఇబ్బందిగా ఉందని వాహన చోదకులు వాపోతున్నారు. ఫోర్తు టౌన్ ట్రాఫిక్ పోలీసులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.